క్లుప్తంగా

గంజి పంపిణీ



గంజి పంపిణీ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నగరి : పట్టణంలోని ఓంశక్తి ఆలయం వద్ద పాదచారులకు శుక్రవారం గంజి పంపిణీ చేశారు. నగరి పట్టణ పరిధిలో వివిధ పనులకు వెళ్లే కార్మికులకు, భక్తులకు ఏటా గంజి పంపిణీ చేస్తారు. అందులో భాగంగా భక్తులకు నిర్వాహకులు గంజి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రవికుమార్‌రాజు



కార్వేటినగరం: మండల తహసీల్దార్‌గా రవికుమార్‌రాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో పుత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కార్వేటినగరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. అదేవిధంగా సచివాలయాలకు భూసమస్యల పరిష్కారం కోసం వచ్చేవారికి వీలైనంతవరకు అక్కడే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని సూచించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది శాలువలు కప్పి, పుష్పగుచ్ఛంతో ఘనంగా స్వాగతం పలికారు.

శ్రీరంగరాజుపురానికి జయకుమార్



శ్రీరంగరాజుపురం: మండల తహసీల్దార్‌గా బాధ్యతలు జయకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతుల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆయనకు తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు శుక్రవారం ఆయన మండలకేంద్రంలో తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. అలాగే మండలవ్యాప్తంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

స్పందన అర్జీలపై తక్షణం స్పందించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ పరమేశ్వరస్వామి

పుత్తూరు రూరల్: స్పందనలో వచ్చే వివిధ అర్జీలపై తక్షణం స్పందించాలని తహసీల్దార్ పరమేశ్వరస్వామి సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజుల క్రితమే బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శుక్రవారం ఆర్ఎస్‌డీటీ, సర్వేయర్లు, ఏఎస్ఓ, వీఆర్ఓలు, వీఆర్ఏలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిర్దేశిత సమయంలో సమస్యలను పరిష్కరించాలని దిశానిర్దేశం చేశారు. వివిధ పనులపై వచ్చే ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. వారి సమస్యలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చి సహకరించాలన్నారు. విధి నిర్వహణలో అవినీతికి తావు లేకుండా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలి

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాల నివారణకు డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ ట్రాఫిక్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం అలిపిరి డిపోను పరిశీలించారు. బస్సుల కండీషన్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. చిన్నపాటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించాలని మెకానిక్కులను ఆదేశించారు. ఘాట్ రోడ్డులో తరచూ ప్రమా దాలు చోటుచేసుకోవడం బాధాకరమని, మరోసారి అలాంటి సంఘటనలకు తావులేకుండా డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలని వివరించారు.

నేడు తెలుగు గంగ నీటి సరఫరాకు అంతరాయం

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో శనివారం తెలుగు గంగ నీటి సరఫరాకు అంతరాయం కలుగనున్నట్టు ఎస్ఈ మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతికి నీటి సరఫరా చేసే తెలుగు గంగ హెడ్ వాటర్ వర్క్స్ మెయింటినెన్సులో భాగంగా అమృత్ పథకంలో ఎండి.పుత్తూరు పంపింగ్ స్టేషన్ నుంచి మంగళం పంపింగ్ స్టేషన్ వరకు కనెక్షన్ ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. పంపింగ్ మెయిన్‌కు ఇంటర్ కనెక్షన్ ఇచ్చే పని చేస్తున్నందున శనివారం నీటి సరఫరా ఉండదని వెల్లడించారు. అత్యవసరమైన వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వాటర్ ట్యాంకర్ కోసం వార్డు నెం.4 నుంచి 9 వరకు, వార్డు నంబర్ 12, 13, సంప్రదించాల్సిన అధికారులు డీఈఈ వి.సంజీవకుమార్ (9849907496), వార్డు నంబర్ 10, 11, 25, 26, 27, 32, 33 ప్రజలు డీఈఈ కె.దేవిక (9849983061), వార్డు నంబర్ 3, 14 నుంచి 22 వరకు డీఈఈ జి.మహేష్ (9949095227), వార్డు నంబర్ 1, 2, 42 నుంచి 50 వరకు డీఈఈ ఏ.విజయ్‌కుమార్‌రెడ్డి (9949905556)ని సంప్రదించాలని కోరారు.

నాడు టెన్షన్.. నేడు చేతికే పింఛన్

కోడికోత వినిపించగానే సూర్యుడు నీలిమేఘాలను చీల్చుకుంటూ వస్తున్న సమయంలో టక్కున వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్తున్నాడు. ఎంతోమంది వృద్ధులు, అచేతనంగా పడి ఉన్నవారికి ఓ వరంగా మారింది. రాష్ట్రప్రభుత్వం ప్రతి గ్రామంలో వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు వారి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్, సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. దీంతో యావత్ దేశం మొత్తం వలంటీర్ వ్యవస్థ తీరును ప్రశంసిస్తున్నారు.

- తెల్లవారుతుండగానే గడప వద్దకే పింఛన్
- సేవ చేసే అవకాశం రావడం అదృష్టం అంటున్న వలంటీర్లు



టీడీపీ హయాంలో పింఛన్ కోసం రచ్చబండ వద్ద పడిగాపులు కాస్తున్న లబ్ధిదారులు(ఫైల్)



నేడు ఇంటి వద్దనే వేలిముద్ర తీసుకుని పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పాలసముద్రం : ప్రభుత్వం అందించే పింఛన్ సొమ్మే అభాగ్యుల జీవితానికి సామాజిక భద్రత, జీవనాధారం. అవసాన దశలో ఉన్న వృద్ధులు, ఏ ఆధారం లేని వితంతువులు, అతి కష్టమ్మీద బతుకుబండి లాగించే దివ్యాంగులకు పింఛన్ సొమ్ము ఎంతో ఆసరాగా నిలుస్తోంది. గతంలో వీరు పింఛన్ తీసుకోవడానికి నరకయాతన పడేవారు. గంటల తరబడి పంచాయతీ కార్యాలయాల వద్ద అల్లాడిపోయేవారు. పింఛన్ మంజూరు కావాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సుతో పాటు అధికార పార్టీ నాయకులు, అధికారుల చుట్టు తిరిగినా అందేది కాదు. ఒకవేళ పింఛన్ మంజూరైనా తెచ్చుకునేందుకు వారం రోజుల పాటు పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడాల్సిన దుర్భర పరిస్థితి ఉండేది. నడవలేని స్థితిలో మంచాన పడిన వారి బాధ వర్ణనాతీతం. కానీ వీరి కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే పంపి పింఛన్ అందించేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామునే వలంటీర్లు ఇంటి ముంగిటకే వచ్చి పింఛన్ అందిస్తుండడంతో అవ్వతాతాల ఆనందం అంతాఇంతా కాదు.

పంచాయతీ కార్యాలయం వద్ద పడికాపులు..

గత టీడీపీ ప్రభుత్వంలో అవ్వాతాతలు మైళ్ల కొద్దీ దూరం వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసేవారు. కొన్నిసార్లు సొమ్మసిల్లి పడిపోయేవారు. తప్పని పరిస్థితుల్లో పింఛన్ తీసుకునేవారు. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఒకటో తేదీన కోడికూయక ముందే ఇంటి ముంగిటే పింఛన్ అందిస్తోంది. టీడీపీ హయాంలో పింఛను కోసం మూడు రోజుల నుంచి ఐదు రోజుల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కొన్నిసార్లు డబ్బులు లేవని మరుసటి నెలలో ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఒక రోజులోనే అందరికీ పింఛన్ అందిస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో మండలంలో 2455 మందికి మాత్రమే పింఛన్ వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా మండలంలో 3699 మందికి ప్రతి నెలా రూ.1.12 కోట్లు నగదు పింఛన్ రూపంలో అందిస్తున్నారు.

నరకయాతన పడ్డాను..



నేను చంద్రబాబు హయాంలో పింఛన్ తీసుకోవడానికి వీఆర్ కుప్పం పంచాయతీకి వెళ్తాంటి. పేరు పిలిచేంత వరకు అక్కడే కూడా. కనీసం తాగడానికి కూడా నీళ్లు ఉండేవి. అయితే సీఎం జగనయ్య పుణ్యమా అని తెల్లవారకముందే వలంటీర్ తలుపు తట్టి నా ఇంటి వద్దకే వచ్చి చేతిలో పింఛన్ ఇస్తున్నారు. నాలాంటి ఎంతోమందికి నిజంగా పింఛన్ తీసుకునే కష్టాల నుంచి బయడపడేశారు.

– పాపమ్మ, కన్నికాపురం, దళితవాడ



నాది ఎస్‌కేఆర్ పురం గ్రామం. నా భర్త సుమారు 10 ఏళ్ల కిందట మరణించాడు. కూలి పనులే జీవనాధారం. టీడీపీ హయాంలో ఇచ్చే రూ.వెయ్యి పింఛన్ తీసుకోవడానికి రెండు, మూడు రోజులు కూలి పనులు మానుకుని పడిగాపులు కాచేదాన్ని. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత వేకువజామునే వలంటీర్ వచ్చి పింఛన్ అందిస్తున్నాడు. దీంతో నేను కూలి పనులకు వెళ్తున్నాను.

– సీత, ఎస్‌కేఆర్ పురం, వితంతురాలు

సేవ చేసే అదృష్టం వచ్చింది..



ఒకటో తేదీ ఉదయం 5 గంటల నుంచే అవ్వాతాతలకు సేవ చేసే అదృష్టం లభించింది. వారికి పింఛన్ అందజేసినప్పుడు వారి ముఖంలో బోసి నవ్వు చూసి మేము సంతోష పడుతున్నాం. ఎవరైనా అనారోగ్యంతో బయట ప్రాంతాల్లోని ఆస్పత్రిలో ఉంటే వారికి అక్కడికే వెళ్లి పింఛన్ అందజేస్తున్నాను.

– జయకుమార్, వలంటీర్, ఎస్‌కేఆర్ పురం

ముందురోజే కసరత్తు..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒకరోజు ముందు నుంచే పింఛన్ల పంపిణీకి కసరత్తు చేస్తున్నాం. వలంటీర్లకు అవసరమైన పింఛన్ నగదు వివరాలు ముందుగానే అందజేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ సకాలంలో వలంటీర్లు పింఛన్లు అందజేస్తున్నారు. అవ్వతాతల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదు.

– గురవయ్య, వెల్ఫేర్ అసిస్టెంట్

చరిత్రాత్మకంగా పంపిణీ..



ఎప్పుడూ లేనివిధంగా ఈ ప్రభుత్వంలో పింఛన్ పంపిణీ చారిత్రాత్మకంగా జరుగుతోంది. ప్రతినెలా ఆఖరు రోజునే పింఛన్ పంపిణీకి వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా పింఛన్ పంపిణీ జరిగేలా నేను కూడా వలంటీర్లతో కలసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నాం.

– ప్రేమ్‌రాజ్‌కుమార్, ఎంపీడీఓ, పాలసముద్రం

బాధిత కుటుంబానికి పరామర్శ



లక్ష్మీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మీ(47) కొన్నాళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది. సమాచారం అందుకున్న రాష్ట ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి లక్ష్మి మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్సార్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయం కింద అందించిన రూ.10 వేలు నగదును వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం లక్ష్మి చాలా కష్టపడి పని చేశారని ఆమె మృతి పార్టీకి తీరని లోటన్నారు. పార్టీ తరపున లక్ష్మి కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని తెలిపారు. మంత్రి వెంట ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య, నాయకులు సురేష్, మాసలామణి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలి





ఐటీఐ కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సెట్విన్ ప్రతినిధులు, విద్యార్థులతో మాట్లాడుతున్న సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్

- సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్

విజయపురం (నగరి) : విద్యార్థులు మంచి లక్ష్యాలను నిర్ణయించుకుని ఉన్నతస్థాయిలో రాణించాలని జిల్లా యువజనుల సర్వీసుల శాఖ సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యత అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళాశాలలో నాణ్యమైన శిక్షణ పొందడంతో పాటు పలు అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ శాఖ ద్వారా ఆర్మీ, నేవీ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు తగు స్థాయిలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీసోర్స్ పర్సన్ ఏఎస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు తీవ్రమైన పోటీ కలిగిన నేటి ప్రపంచంలో వివిధ అంశాలపై నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. నాయకత్వ లక్షణాలతో పాటు కమ్యూనికేషన్‌లో మంచి నైపుణ్యత కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గణేష్, రీసోర్స్ పర్సన్ ఎస్ఎస్ రెడ్డి, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాలను అందిస్తున్న సర్పంచ్ సరళ

కార్వేటినగరం: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సర్పంచ్ సరళ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కేఎంపురం ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడం హర్షణీయమన్నారు. పాఠశాలల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2 వేలు, తృతీయస్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.వెయ్యి చొప్పున అందించి, ప్రశంసాపత్రాలను అందించారు. ప్రతి విద్యార్థి పోటీ పడి విద్యను అభ్యసించి ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని అందుకోవాలన్నారు. అనంతరం కేఎంపురం ఉన్నత పాఠశాల హెచ్ఎం పీ.సునీత మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యావిధానంలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను విద్యార్థులు అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ప్రైవేటు పాఠశాలల కన్నా సుందరంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది అన్నిరకాల మౌలిక వసతులను కల్పిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో కంటే ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పడానికి విద్యార్థుల తల్లిదండ్రులు క్యూ కడుతున్నారని గుర్తు చేశారు. అనంతరం విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ వెంకటేష్, మాజీ సర్పంచ్ విజయులురెడ్డి, కందయ్య, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం



బట్టువారిపల్లిలో తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్

కార్వేటినగరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యమని సర్పంచ్ దివ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కొల్లాగుంట పంచాయతీ బట్టువారిపల్లిలో తాగునీటి కోసం బోరు డ్రిల్లింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎన్నడూ లేనివిధంగా మురుగునీటి కాలువలు, తాగునీటి బోర్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. గత కొన్ని రోజులుగా బట్టువారిపల్లి గ్రామంలో తాగునీటి కొరత ఏర్పడడంతో వాటిని అధిగమించడానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో రూ.2.15 లక్షలు వెచ్చించి నూతన బోరు, మోటారు ఏర్పాటు చేశామన్నారు. సచివాలయాలు ఏర్పాటుతో అధికారులను గ్రామాలకు తీసుకొచ్చి సేవలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరో ఆదరించాలని ప్రజలకు సర్పంచ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, గాంధీ, కుమార్, కార్యదర్శి వాసు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ తులసీరాం, వీఆర్ఓ గుణ పలువురు పాల్గొన్నారు.

పాలేటమ్మకు వెండి కిరీటం సమర్పణ



వెండి కిరీటధారణతో పాలేటమ్మ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామ దేవత పాలేటమ్మకు గ్రామస్తులు పింగాణి రామస్వామిరెడ్డి, సుశీలమ్మ దంపతులు వెండి కిరీటాన్ని సమర్పించారు. శుక్రవారం అమ్మవారికి వెండి కిరీటం అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. వారు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో తమ కుటుంబం బాగుందని, అందుకే రూ.1.5లక్షలతో ఈ కిరీటాన్ని చేయించామని, పర్వ దినాలలో అమ్మవారికి వెండి కిరీటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, వెంకటకృష్ణారెడ్డి, వేంకటేశ్వర్లు, కాశీబాబు, విజయనాయుడు, వెంకటాచలం, వెంకటకృష్ణయ్య, శేఖర్, శ్రీనివాసులు, సుబ్బయ్య, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీది పారదర్శక పాలన



మఠవలం గ్రామంలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి

పాలసముద్రం : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. శుక్రవారం ఆయన శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయాల పరిధిలోని మఠవలం, సీఎం కండ్రిగ, సింహరాజుపురం దళితవాడ, వినాయకపురం, సింహరాజుపురం బీసీ కాలనీల్లో సర్పంచ్‌లు భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పా ల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లబ్ధి పొందిన పథకాలకు సంబంధించిన బుక్‌లెట్ అందజేసి పథకాల గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల కన్నా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మెరుగైన సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ లబ్ధిని అందజేస్తున్నారని తెలిపారు. 1092 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే ముఖ్యమంత్రి కార్యాలయంలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ప్రజలకు అనుగుణంగా సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇలా జనం గుండెల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు చిరస్థాయిగా నిలిచిపోనున్నాయని తెలిపారు.

వెలుస్తున్న ఊర్లు..

పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటూ రైతన్నలకు అండగా నిలుస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎ స్సార్‌సీపీ ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు పథకాల కోసం జన్మభూమి కమిటీల చు ట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. కానీ పథకాలు వర్తించేవి కాదని గుర్తు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంత టి సంక్షేమం, అభివృద్ధి జరిగిందా అని ప్రశ్నించారు. జగనన్న కాలనీలు అన్నీ కొత్త గ్రామాలుగా వెలుస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్నజగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, కోఆప్షన్ మెంబర్ జ్ఞానశేఖర్, తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ దాము, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, ఏఓ ఢిల్లీప్రసాద్, ట్రాన్స్‌కో ఏడీ జ్ఞానేశ్వర్, ఎస్ఐ సురేష్, సర్పంచులు గాలి మహేష్ బాబు, పుత్తూరు కేశవరెడ్డి, సుందరరాజు, విజయరా ఘవరె డ్డి, చంద్రశేఖర్‌రాజు, పద్మనాథనాయుడు, నరసింహనాయుడు, ఢిల్లీ, గోపాల్, కృష్ణయ్య, వేణు, ష ణ్ముగరె డ్డి, వాసురాజు, ధనుంజయులు, బాబు, మనోహర్, మండలస్థాయిఅధికారులు, నాయకులు పాల్గొన్నారు.

తలుపు తట్టి పింఛన్ ఇస్తున్నారు..



గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకోవడానికి అవస్థలు పడేవాళ్లం. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. మాకు కొడుకులు, కూతుర్లు ఉన్నా ప్రతి నెలా 1వ తేదీన తలుపు తట్టి వలంటీర్లు పింఛన్ ఇస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు పెద్ద కొడుకులా ఆదుకుంటున్నాడు. మేము ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

– ధనలక్ష్మి, వినాయకపురం, వితంతురాలు

ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చల్లగా ఉండాలి. గత ప్రభుత్వంలో నిత్యావసర సరుకులు తీసుకోవడానికి చౌక దుకాణాలకు రోజుల కొద్దీ వెళ్లాల్సి వచ్చేది. అక్కడ గంటల తరబడి వేచి ఉండి అష్టకష్టాలు పడి నిత్యావసర సరుకులు తెచ్చుకునేవాళ్లం. కూలి పనికి వెళ్లలేక పోయే వాళ్లం. మా కష్టాలు తెలుసుకున్న జగనన్న ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందిస్తున్నారు.

– రోజా, సింహరాజుపురం దళితవాడ, గృహిణి

అన్నలా ఆదుకున్నాడు..



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు అన్నలా ఆదుకుంటున్నాడు. సంక్షేమ పథకాలను బటన్ నొక్కి మా ఖాతాల్లో జమ చేస్తున్నాడు. జగనన్న అమ్మఒడి రూ.29 వేలు, వైఎస్సార్ ఆసరా రూ.20,238, వైఎస్సార్ సున్నావడ్డీ రూ.3,438, వైఎస్సార్ రైతు భరోసా రూ.24,500, జగనన్న తోడు వంటి పథకాల ద్వారా నేను నాలుగేళ్లలో రూ.2,50,000 లబ్ధి పొందాను. అందువల్లమా కుటుంబం జగనన్నకు తోడుగా ఉంటుంది.

– లక్ష్మీ, సింహరాజుపురం బీసీ కాలనీ, గృహిణి

తాత్కాలికంగా యంత్రాల తరలింపు నిలిపివేత



ఇరువర్గాలతో మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

పుత్తూరు రూరల్: స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లులోని యంత్రాలను తరలించాలన్న యాజమాన్యపు ప్రయత్నాన్ని కార్మికులు రెండవ రోజు శుక్రవారం అడ్డుకున్నారు. గత రెండు నెలలుగా కార్మికులు చేస్తున్న ఆందోళన గురువారం తీవ్ర రూపం దాల్చింది. మిల్లులోని యంత్రాలు తరలించడానికి యాజమాన్యం మెకానిక్స్‌ను తీసుకురావడంతో మిల్లు వద్దే ధర్నా చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. పోలీసుల జోక్యంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. అయితే శుక్రవారం మరోసారి మిల్లు యాజమాన్యం యంత్రాలను తరలించడానికి ప్రయత్నించగా కార్మికులు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో చేసేది లేక యాజమాన్యం మళ్లీ పోలీసులను ఆశ్రయించింది. సీఐ లక్ష్మీనారాయణ పోలీస్‌స్టేషన్‌లో మిల్లు మేనేజర్ మాధవన్, కార్మిక నాయకులు ఏలుమలైరెడ్డి, బాబుతో సమావేశం నిర్వహించారు. ఇరువర్గాల వాదనలు విన్న సీఐ మాట్లాడుతూ శనివారం తిరుపతిలో డీసీఎల్ వద జరిగే సమావేశంలో సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. అంతవరకు యంత్రాలను తరలించవద్దని మేనేజర్‌ను ఆదేశించారు. దీంతో తాత్కాలికంగా సమస్య సద్దుమణిగింది.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు భరోసా



విజయపురంలో విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్ అందజేస్తున్న అధికారులు



శ్రీహరిపురంలో ..

విజయపురం (నగరి) : రాష్ట్రప్రభుత్వం ప్రతి పేద విద్యార్థికి బంగారు భవిష్యత్ అందించేలా భరోసా కల్పిస్తోందని ఎంఈఓ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని విజయపురం, శ్రీహరిపురం, జంబాడ, గంగమాంబపురం, పన్నూరు ఉన్నత పాఠశాలలో పది పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించారు. ఇందులో భాగంగా జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా అవార్డులు అందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. అమ్మఒడి ద్వారా ఏటా రూ.15 వేలు తల్లుల అకౌంట్లలోకి జమ చేస్తున్నారన్నారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఉచిత హియరింగ్ టెస్ట్

తిరుపతి కల్చరల్: తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శని, ఆదివారాల్లో ఉచిత హియరింగ్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఆడియాలజిస్టు డాక్టర్ పి.గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి మొబైల్ ఫోను కనెక్టివిటీ, బ్లూటూత్ రీ చార్జబుల్, డిజిటల్ వంటి సూక్ష్మమైన వినికిడి హియరింగ్ ఎయిడ్స్ ఉచితంగా ట్రైల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. అలాగే హియరింగ్ ఎయిడ్స్‌పై 25 శాతం డిస్కౌంట్ ఇస్తామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 9849085342లో సంప్రదించాలని కోరారు.